# హస్తం దౌర్జన్యం!

- అడుగడుగునా కోడ్ ఉల్లంఘనలు
- వాహనంతో దూసుకొచ్చిన కొండల్ రెడ్డి
- పోలింగ్ బూత్‌లలో హల్‌చల్ చేసిన వైనం
- చేష్టలుడిగి చూసిన ఎన్నికల యంత్రాంగం
- ఎన్నికల నియమావళిని పట్టించుకోని కాంగ్రెస్



పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకొచ్చిన కొండల్‌రెడ్డి వాహనం

నిజామాబాద్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కామారెడ్డి : ప్రజాస్వామ్య విలువలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా పోలింగ్ రోజు కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యవహరించారు. వీరికి ఎన్నికల అధికార యంత్రాంగం వంత పాడడం కామారెడ్డి నియోజకవర్గంలో చోటు చేసుకున్నది. ఆది నుంచి వివాదాస్పదంగా మారిన పీసీసీ చీఫ్, కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి వ్యవహారం పోలింగ్ రోజున మరోసారి వివాదాస్పదమైంది. దగ్గరుండి అనుచరులతో పోలింగ్ బూతుల్లోకి వెళ్లి హల్‌చల్ చేయడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఇదంతా కండ్ల ముందే జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికార యంత్రాంగం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లోకి కొండల్ రెడ్డి ఏకంగా వాహనంతో లోనికి వెళ్లడం వివాదాస్పదమైంది. వాస్తవానికి ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల వెలుపలే వాహనాలను వదిలి వెళ్లాలి. ఈసీ అనుమతించిన వాహనాలు మినహా ఎవ్వరూ 100 మీటర్ల పరిధిలోనికి వెళ్లకూడదు. కాంగ్రెస్ అభ్యర్థి తమ్ముడు మాత్రం యథేచ్ఛగా వాహనంతో పోలింగ్ బూత్‌లోకి వెళ్లినా పోలీసులు ఇసుమంతైనా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది.

**వారిపై ప్రేమ ఎందుకు?**

కామారెడ్డి పోలీసుల ద్వంద్వ వైఖరిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో కీలక నేతలు పోటీ చేస్తుండడంతో పార్టీల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. మొదటి నుంచి గొడవలు సృష్టించి ప్రజల్లో భయాందోళనలు కలిగించి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగానే రకరకాల కుయుక్తులకు దిగి అడ్డంగా నోట్ల కట్టలతోనూ కామారెడ్డిలో హస్తం పార్టీ నేతలు దొరికారు. ఇది జరిగిన 24గంటల్లోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సైతం ఉల్లంఘించినా సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విస్మయానికి గురి చేసింది. సామాన్యులు ఓటేసేందుకు వచ్చినప్పుడు వెంట సెల్‌ఫోన్లు తెచ్చుకుంటేనే పోలీసులు ఇబ్బందికి గురి చేశారు. పోలింగ్ బూత్ బయట వేరే వారికి సెల్‌ఫోన్ అప్పగిస్తామని సర్ది చెప్పినా వినిపించుకోకుండా కఠినంగా వ్యవహరించారు. అలాంటి సమయంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి తమ్ముడు ఏకంగా వాహనంతో వస్తుంటే రెడ్ కార్పెట్ వేసినట్లుగా మున్సిపల్ ఆఫీస్ గేట్లు తీసి లోనికి అనుమతించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్కడ పని చేస్తున్న ఖాకీలకు అంతగా ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చింది? అన్న అనుమానాలు అందరిలో వ్యక్తం అయ్యాయి.



కొండల్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్

**నిలదీసిన బీఆర్‌ఎస్ నేతలు...**

కండ్ల ముందే కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తుంటే పోలీసులు, ఎన్నికల అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోక పోవడంపై బీఆర్‌ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కామారెడ్డి మున్సిపల్ ఆఫీస్ పోలింగ్ బూత్‌లో అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్ స్వయంగా ఈ తతంగాన్ని గమనించి కొండల్ రెడ్డిని నిలదీశారు. ఏ అర్హతతో కామారెడ్డిలో సంచరిస్తున్నావని ప్రశ్నల వర్షం కురిపించారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో స్థానికేతరులు నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని రూల్స్ ఉన్నప్పటికీ పోలింగ్ బూత్‌లలో తిరిగేందుకు నువ్వేమైనా అభ్యర్థివా? అంటూ నిట్టు వేణుగోపాల్ ప్రశ్నల వర్షం కురిపించారు. నిట్టు అడిగిన ప్రశ్నలకు కొండల్ రెడ్డి సమాధానాలు చెప్పలేకపోయారు. మున్సిపల్ ఆఫీస్ నుంచి నిజాంసాగర్ చౌరస్తాలోని బాయ్స్ స్కూల్‌కు చేరిన కొండల్ రెడ్డి అక్కడ కూడా తన అనుచరులతో హల్ చల్ చేసే ప్రయత్నం చేశారు. పదుల సంఖ్యలో కాంగ్రెస్ నాయకులను వెంటేసుకుని పోలింగ్ బూత్‌లకు వెళ్తున్న కొండల్ రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ అడ్డుకున్నారు. ఇదేం పద్ధతి అంటూ పోలీస్ అధికారులను అడిగారు. త్రిబుల్ రైడింగ్ చేస్తే ఫైన్‌లు వేసే పోలీసులకు ఎన్నికల ఉల్లంఘనలు కనిపించడం లేదా? అంటూ ప్రశ్నించగా ఖాకీలు సమాధానం చెప్పకుండా రేవంత్ రెడ్డి తమ్ముడిని అక్కడ్నుంచి తప్పించి తన వాహనంలోకి సురక్షితంగా ఎక్కించేందుకు ప్రయత్నించారు. బీఆర్‌ఎస్ నేతలంతా ఈ తంతును గమనించి కొద్దిసేపు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నిట్టు వేణుగోపాల్ మాట్లాడుతూ కామారెడ్డిలో రేవంత్ రెడ్డి ఓడిపోతున్నాడనే భయంతో కాంగ్రెస్ నాయకులు చిల్లర వేషాలు వేస్తున్నారని అన్నారు. కొడంగల్ నుంచి రౌడీ మూకలను రప్పించి కామారెడ్డిలో కల్లోలం సృష్టిస్తున్నారని అన్నారు.

కేసీఆర్ గెలుపును ఎవరూ ఆపలేరని ఇలాంటి ఆరాచకపు పనులు చేస్తే ప్రజలు సహించరని కేసీఆర్ గెలుపుతో కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబుతారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిలో చిచ్చు పెడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ఖబడ్దార్ ఇలాంటి నీచ రాజకీయాలు కామారెడ్డిలో చెల్లవని స్పష్టం చేశారు. కేసీఆర్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. రేవంత్‌ను కామారెడ్డి నుంచి సాగనంపే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

## ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

**బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి**

బాన్సువాడ, నవంబర్ 30 : శాసనసభ ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు తన వెంట ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల అభిమానం, ఆదరణతో బాన్సువాడ నియోజక వర్గంలో గులాబీ జెండా ఎగురబోతున్నదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని.. రాత్రనక పగలనక కృషి చేసిన అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించిన ఎన్నికల అధికారులకు అభినందనలను తెలిపారు. సహకారం అందించిన మీడియా సంస్థలకు , విలేకరులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అందరి అభిమానం, సహకారం, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నట్లు స్పీకర్ పోచారం తెలిపారు.

## ఎంపీపీని పరామర్శించిన విప్ గంప గోవర్ధన్



ఎంపీపీ బాలామణిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు

బీబీపేట్, నవంబర్ 30: మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడిలో ఎంపీపీ బాలామణి గాయపడింది. మండల కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలామణిని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విప్ వెంట జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, చిన్న నర్సింగరావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ నాగరాజ్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మీసత్యనారాయణ, మార్కె ట్ కమిటీ డైరెక్టర్ ప్రసాద్, టౌన్ అధ్యక్షుడు పర్షరాములు, నాయకులు బాశెట్టి నాగేశ్వర్, ఆంజనేయు లు, పోచయ్య. సిద్దరాములు, రాజు, వెంకటి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను పరిశీలించాలి

కామారెడ్డి, నవంబర్ 30 : సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను పరిశీలించాలని సాధారణ పరిశీలకుడు ఛిఫంగ్ ఆర్థర్ వర్ఛ్యాయో సూచించారు. మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలో జరిగే సాధరాణ ఎన్నికల పోలింగ్ తీరును పరిశీలించారు. సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు.




కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న అధికారి

# ఉమ్మడి జిల్లాలో తొమ్మిది స్థానాలు మావే..

- రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నాం
- అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తుంది
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



భీమగల్‌లోని ఓ పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, నవంబర్ 30 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంటుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సరళిని పరిశీలించిన అనంతరం భీమ్‌గల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తొమ్మిది స్థానాల్లో ఏడు స్థానాలు మంచి మెజారిటీతో రెండు స్వల్ప మెజారిటీతో గెలుస్తున్నామని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో తనకు 55 శాతం పైబడి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై, తన కుటుంబపై ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు పట్టించుకోకుండా తన వైపే నిలిచారని తెలిపారు. తప్పుడు ప్రచారం చేసిన వారికి రానున్న ఫలితం చెంపపెట్టు అవుతుందన్నారు. రాష్ట్రంలో 119 సీట్లకు గాను 80 సీట్లను బీఆర్‌ఎస్ గెలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గెలుపునకు దోహదం చేశాయని, మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజలకు మంచి సేవలు అందజేస్తామని పేర్కొన్నారు. గెలిచిన తరువాత తాను కేసీఆర్ సైనికుడిలా ఉంటానని మంత్రి తెలిపారు.

ఆయన వెంట డాక్టర్ మధుశేఖర్, మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత, కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, KOTTALA PAKPATLA PADMA R/o. 7-56, Padgal, Velpoor, Nizamabad, Now Changed my Surname/Name as **KOTTALA PADMA**

NTZ-318691

**CHANGE OF NAME**

★I, KOTTALA PAKPATLA GANGA REDDY R/o.7-56, Padgal, Velpoor, Nizamabad. Now changed my Surname/Name as **KOTTALA GANGA REDDY**

NTZ-318691




**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.

NT-314461

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.